క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చేబ్రోలు: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శనివారం సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ బి.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉదయం నుంచి మధ్యాహ్నం సరఫరాకు అంతరాయం ఉంటుందని చెప్పారు.

నేడు మామిళ్లపల్లిలో రచ్చబండ

పొన్నూరు: ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ తలపెట్టిన రచ్చబండ కార్యక్రమాన్ని శనివారం పొన్నూరు మండలంలోని మామిళ్ళపల్లిలో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ శుక్రవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న కార్యక్రమంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నియోజకవర్గానికి సంబంధించి 60 వేల సంతకాల సేకరణ చేపట్టనున్నట్లు తెలిపారు.

14న చేబ్రోలు మండల పరిషత్ సమావేశం

చేబ్రోలు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 14వ తేదీ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ టి.ఉషారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎంపీపీ కే సాహితి అధ్యక్షత వహిస్తారని చెప్పారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ శాఖల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించనున్నట్లు వివరించారు. మండల పరిధిలోని అన్ని గ్రామాలకు చెందిన ఎంపీటీసీలు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు హాజరుకావాలని కోరారు.

ప్రశాంత వాతావరణంలో జీవనం సాగించాలి

పొన్నూరు: ప్రశాంత వాతావరణంలో ప్రతి ఒక్కరూ జీవనం సాగించాలని మండల సేవాధికార సంస్థ చైర్ పర్సన్, ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి జి.రుక్మిణి అన్నారు. శుక్రవారం మండల న్యాయసేవాధి కార సంస్థ, న్యాయ సేవ కమిటీ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, మానసికంగా బలంగా ఉన్నప్పుడే శారీరక ఆరోగ్యం కూడా సమకూరుతుందని అన్నారు. అందువల్ల సకాలంలో భోజనం, నిద్ర, శరీరం వ్యాయామం చేయటం ద్వారా మానసిక ఆరోగ్యం పొందవచ్చునని చెప్పారు. ప్రతి ఒక్కరు ఇప్పుడు సెల్ ఫోన్ కు ఆకర్షితులై మానసిక సమస్యలకు గురవుతున్నారని అన్నారు. అవసరమైనప్పుడు తప్ప మొబైల్‌ను తక్కువగా వినియోగించాలని ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణంలో జీవనం సాగించాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ హరికృష్ణ, డాక్టర్ మమత, డాక్టర్ రాణి, డాక్టర్ రహేమత్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ షేక్ బాజీ సాహెబ్, న్యాయవాదులు మక్బుల్ బేగ్, ముజీర్, షబీర్ పాల్గొన్నారు.

డ్రగ్స్ విక్రయాలు నియంత్రించాలని వినతి



నగరంపాలెం: స్థానిక నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ)లో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌ను శుక్రవారం బీజేపీ జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం పుష్పగుచ్ఛాన్ని అందించారు. జిల్లాలో యువత డ్రగ్స్ వాడకం ఎక్కువగా ఉందని జిల్లా అధ్యక్షుడు తిరుపతిరావు జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకొచ్చారు. డ్రగ్స్ విక్రయాలను నియంత్రించాలని అన్నారు. సైబర్ నేరాల వల్ల అనేక మంది ఇబ్బందులకు గురవుతున్నారని, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఎస్పీని కలిసిన వారిలో భీమినేని చంద్రశేఖర్, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్, చరక కుమార్‌గౌడ్, వై.వి. సుబ్బారావు, బి.రామకృష్ణ, డి.సత్యనారాయణ, టి.శ్రీనివాసరావు, కార్యదర్శి ఎన్.వీర మణీంద్ర ఉన్నారు.

రేపు మానసిక వ్యాధుల ఉచిత వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: మానసిక వ్యాధులపై ఈనెల 12వ తేదీ ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నారు. సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినెల రెండో ఆదివారం 'స్పెషలిస్టులతో ఉచితవైద్య శిబిరాల్లో భాగంగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంస్థల అధ్యక్షులు డాక్టర్ టి.సేవకుమార్, పావులూరి రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు 2/1 బ్రాడీపేట లోని ఎస్.హెచ్.ఓ భవనంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వైద్య శిబిరంలో మానసిక వైద్య నిపుణులు డాక్టర్ కె.ఎల్. తేజస్విని దీర్ఘకాల వ్యాధులు లైన డయాబెటిస్, అధిక రక్తపోటు బాధితులలో మానసిక సమస్యలుతదితర అంశాలపై శాస్త్రీయ అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

పేద విద్యార్థుల ప్రాణాలతో కూటమి చెలగాటం

వైఎస్సార్ సీపీ నాయకులు బలసాని, నూరిఫాతిమా



విద్యార్థులను పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు బలసాని, నూరిఫాతిమా

గుంటూరు రూరల్: హాస్టళ్లపై నిర్లక్ష్యంతో పేద విద్యార్థుల ప్రాణాలతో కూటమి ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ విమర్శించారు. పెదనందిపాడు మండలం అనపర్రు గ్రామంలోని బీసీ బాలుర హాస్టల్ విద్యార్థులు శుక్రవారం అస్వస్థతకు గురికావడంతో పెదనందిపాడు పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. వైద్యులతో ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేశారు. ఈ సందర్భంగా బలసాని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యా వ్యవస్థను పట్టించుకున్న దాఖలాలు లేవని ధ్వజమెత్తారు విద్యార్థులకు హాస్టల్లో కనీసం మౌలిక వసతులు కల్పించడంలో కూడా కూటమి ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. హాస్పిటల్లోనే కాకుండా ఇంకా కొంత మంది వసతిగృహంలో జ్వరంతో బాధపడుతున్నారని తెలిపారు. ఇంత జరుగుతున్న హాస్టల్లో వార్డెన్ అందుబాటులో లేకపోవడం చాలా దురదృష్టకరమన్నారు. దీన్ని బట్టి చూస్తే ప్రభుత్వ పాఠశాలలు, హాస్టల్స్ అంటే కూటమి ప్రభుత్వానికి ఎంత నిర్లక్ష్యమో తెలుస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం విద్య, వైద్యాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, విద్యార్థులకు సరైన వైద్యం అందించాలని, పేద విద్యార్థుల పట్ల కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి నిద్రమత్తును విడనాడాలని డిమాండ్ చేశారు. గుంటూరు రూరల్ మండలం తురకపాలెంలో కూడా ఇలాంటి ఘటనే జరిగితే వారి మీద వీరి మీద బురద చల్లడం తప్ప సమస్య పరిష్కరించలేదన్నారు.

జీజీహెచ్‌లో విద్యార్థులకు పరామర్శ

అనపర్రు గ్రామం బీసీ బాలుర హాస్టల్ విద్యార్థులు వాంతులు, విరోచనాలతో తీవ్ర అస్వస్థకు గురై స్థానిక పీహెచ్‌సీలో చికిత్స పొందుతూ మెరుగైన చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాలకు తరలించిన విద్యార్థులను వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు నూరిఫాతిమా, ప్రత్తిపాడు సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. మెరుగైన చికిత్సను అందించి వారు త్వరగా కోలుకునేందుకు కృషి చేయాలని వైద్యులను కోరారు.

యార్డు సేవలు అంతంతమాత్రమే..

- పరపతి ఉన్నవారిదే పెత్తనం..
- ధాన్యం నిల్వకు సామాన్య రైతులకు అందని గోదాములు
- పొన్నూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిస్థితి



యార్డు ఆవరణలోని గోదాములు

పొన్నూరు: మార్కెట్ కమిటీలు రైతులకు దూరమవుతున్నాయి. సేవలందించడంలో తడబడుతున్నాయి. నిధులు వినియోగంలో ప్రణాళిక కనిపించడం లేదు. సామాన్య రైతులకు సేవలందక, పెత్తందార్ల అజమాయిషీలో యార్డు పాలన సాగుతోందనే విమర్శలు లేకపోలేదు. అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది.

సెస్, రెన్యువల్స్, లీజులు, వివిధ రూపాల్లో మార్కెటింగ్ శాఖకు ఆదాయం రావాల్సి ఉన్నా, అధికారుల పర్యవేక్షణ కొరవడి, కొందరు సిబ్బంది చేతివాటం కారణంగా పక్కదారి పడుతోందనే ఆరోపణలు ఉన్నాయి.

యార్డు పరిధి ఇలా...

పొన్నూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ 12 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. యార్డు ప్రాంగణంలో 12 గోదాములున్నాయి. వాటిలో జీడీసీఎంఎస్, వేర్ హౌసింగ్ కార్పొరేషన్, ఆర్బీకే ల్యాబ్, 7 గోదాములు ధాన్యం నిల్వకు, మరొకటి రైతులు విశ్రాంతికి వినియోగిస్తున్నారు. 40 వేల ధాన్యం బస్తాలు నిల్వ చేసే సామర్థ్యం ఉంది. యార్డు పరిధిలో శాఖ కేటాయించిన ఏడాదికి రూ.8 కోట్ల ఆదాయం లక్ష్యాన్ని పూర్తి చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

చెక్ పోస్టులు ఎక్కడెక్కడంటే..

మార్కెట్ యార్డ పరిధిలో నాలుగు చెక్‌పోస్టులున్నాయి. నిడుబ్రోలు, చుండూరుపల్లి, బ్రాహ్మణ కోడూరు, నారాకోడూరు గ్రామ పరిధిలో ఉన్నాయి. ఒక్కొక్క చెక్‌పోస్టు నుంచి నెలకు సుమారుగా రూ.8 లక్షలు ఆదాయం సమకూరుతోంది.

ఆదాయం ఎలా...

వ్యవసాయ ఆధారిత ప్రాంతమైన పొన్నూరు మార్కెట్ యార్డు పరిధిలో వరి ఖరీఫ్, రబీ సీజన్లలో వరి సుమారు 28 వేల ఎకరాల్లో సాగవుతోంది. తద్వారా అత్యధిక ఆదాయంతో పాటు వాణిజ్య పంటల నుంచి కొంత మేర రాబడి నమోదు అవుతోంది.

వసతులు అరకొర..

మార్కెట్ యార్డు ప్రాంగణం ప్రధాన రహదారి కంటే పల్లంగా ఉంది. స్థానిక రైతులు యార్డులో ధాన్యం ఆరబెట్టుకుని అక్కడే గోదాముల్లో నిల్వ చేసుకునే అవకాశాన్ని అధికారులు కల్పించాల్సి ఉంది. అయితే కింది స్థాయి సిబ్బంది కొందరు కీలకంగా వ్యవహరిస్తూ పరపతి ఉన్నోళ్లకే సహకరిస్తుండటంతో యార్డులో ధాన్యం నిల్వకు అవకాశం దక్కడం లేదని రైతులు చెబుతున్నారు.

సిబ్బంది కొరత..

ఆదాయ మార్గాలు పెంచుకోవడంలో పొన్నూరు మార్కెట్ యార్డు వెనుకంజలో ఉంది. అవకాశాలు ఉన్నప్పటికీ.. ప్రభుత్వ లక్ష్యాన్ని పూర్తి చేసి మమ అనిపిస్తూ, తమ సొంత ఖజానా నింపుకుంటున్నట్లు ఆరోపణలు లేకపోలేదు. చెక్ పోస్టులపై పర్యవేక్షణ కొరవడటంతో తనిఖీలు లేకుండానే ఉత్పత్తులు సరిహద్దులు దాటుతున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. బదిలీ లేకుండా ఏళ్ల తరబడి ఒకే చోట పని చేస్తున్న ఓ ఉద్యోగి మార్కెట్ యార్డులో కీలకంగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం.

ధాన్యం నిల్వకు రైతులందరికీ అవకాశం

గోదాములలో రైతులందరికీ సంబంధించిన ధాన్యాన్ని నిల్వ చేసుకునే విధంగా చర్యలు చేపడుతున్నాం. ప్రస్తుతం అన్ని గోదాములు నిండుగా ఉన్నాయి. చెక్ పోస్టులలో తనిఖీలు ముమ్మరంగా చేపడతాం. యార్డు పరిధిలో సిబ్బంది కొరత ఉంది సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– ప్రసన్న కుమారి, కార్యదర్శి, వ్యవసాయ మార్కెట్ కమిటీ

వైద్య కాలేజీల ప్రైవేటీకరణపై ప్రజా ఉద్యమం చేద్దాం

- పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ
- నంబూరులో సంతకాల సేకరణకు శ్రీకారం



నంబూరులో మాట్లాడుతున్న అంబటి మురళీకృష్ణ



ఇంటింటికీ తిరిగి సంతకాల సేకరిస్తున్న మురళీకృష్ణ

పెదకాకాని: పేద బడుగు బలహీన వర్గాలకు వైద్య విద్యను దూరం చేసేందుకే కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణకు దారులు తీసిందని వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ, రచ్చబండ కార్యక్రమానికి శుక్రవారం నంబూరులో శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి పార్టీ మండల అధ్యక్షుడు ఎం.మల్లికార్జునరెడ్డి అధ్యక్షత వహించారు. అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ పేద మధ్యతరగతి వర్గాలకు వైద్య విద్య, వైద్యం అందుబాటులో ఉండాలనే ఆశయంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలకు శంకుస్థాపన చేసి నిర్మాణాలు చేపట్టినట్లు చెప్పారు. వాటిలో 5 మెడికల్ కళాశాలలు నిర్మాణం కూడా పూర్తి అయిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆ మెడికల్ కళాశాలలను పేదవారికి దూరం చేస్తూ ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేసేందుకు టెండర్లు పిలవడం దారుణమన్నారు. ప్రభుత్వంలో ఉన్న పెద్దల పేర్లతో టెండర్లలో దక్కించుకోవడం వారిని బినామీగా ఉంచి సొమ్ము చేసుకోవాని పెదబాబు, చినబాబు పెద్ద పథకం వేశారని ఆరోపించారు. కేవలం మెడికల్ సీట్లు వ్యాపారం కోసం మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేస్తున్నాడన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తనపై 11 కేసులు పెట్టించారని, ఉడత ఊపులకు బెదరడానికి సిద్ధంగా లేమని హితవు పలికారు. మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం కాకుండా చూడటం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. నియోజకవర్గంలో 60 వేల సంతకాలు సేకరించడం జరుగుతుందని చెప్పారు. కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణ చేయడాన్ని వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. అనంతరం కోటి సంతకాల పేరుతో ప్లకార్డులు ప్రదర్శించారు. సమావేశం అనంతరం స్థానిక నాయకులతో కలసి అంబటి మురళీకృష్ణ ఇంటింటికీ తిరిగి సంతకాల సేకరణ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి, ఎంపీటీసీ సభ్యుడు షేక్ అబ్దుల్ లతీఫ్, మానవహక్కుల కమిషన్ మాజీ సభ్యుడు గోచిపాతల శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి వుయ్యూరు సతీష్‌రెడ్డి, గ్రామ కన్వీనర్ భీమవరపు కృష్ణారెడ్డి, మందాళ శివారెడ్డి, బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి తాడిబోయిన వేణుగోపాలరావు, చాగంటి మురళీ మోహన్‌రెడ్డి, పార్టీ మండల ఉపాధ్యక్షుడు దంతాల శ్రీనివాసరావు, పార్టీ నాయకులు లంకపల్లి శ్రీనివాసరావు, గద్దల రాజేష్, షేక్ జానీ, దాసరి శ్రీకాంత్ పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమం పోస్టర్ ఆవిష్కరణ

గుంటూరు రూరల్: విద్య, వైద్యాన్ని కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కిందని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గం సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం రూరల్ మండలం ఏటుకూరు బైపాస్ రోడ్డులోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బలసాని మాట్లాడుతూ మెడికల్ కళాశాలలను కట్టటం చేతకాని చంద్రబాబు జగనన్న కష్టపడి తెచ్చిన మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేసి వేల కోట్ల రూపాయల ప్రజా ధనాన్ని, పేద ప్రజల ఆస్తిని కేవలం తమ వర్గానికి కట్టబెట్టేందుకు పీపీపీ విధానం అంటూ ప్రజలను మోసం చేస్తున్నాడన్నారు. మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయకుండా అడ్డుకుని పేద ప్రజల పిల్లలను వైద్యులుగా తీర్చిదిద్దేందుకు జగనన్న నేతృత్వంలో ఉద్యమం చేపట్టినట్లు చెప్పారు. కోటి సంతకాలను సేకరించి వైద్య కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకుంటామని తెలిపారు.

విద్యార్థులకు పరిశుభ్రమైన ఆహారం అందించాలి

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు

ప్రత్తిపాడు: విద్యార్థులకు పరిశుభ్రమైన ఆహారాన్ని అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు అన్నారు. పెదనందిపాడు మండలం అన్నపర్రు బీసీ బాలుర హాస్టల్‌లో కలుషిత ఆహారం తిని కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు, జ్వరంతో అస్వస్థతకు గురై పెదనందిపాడులోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో చికిత్స పొందుతున్న విద్యార్థులను శుక్రవారం సాయంత్రం యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కుమ్మరి క్రాంతికుమార్‌తో కలసి పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ ఇంత మంది పిల్లలు ఆహారం కలుషితమై అస్వస్థతకు గురికావడం చిన్న విషయం కాదన్నారు. దేవుడి దయ వలన పిల్లలకు ఏమీ కాలేదని, ఎంతో పెను ప్రమాదం తప్పిందన్నారు. దీనికి కారణం అధికారుల పర్యవేక్షణాలోపమా, లేక హాస్టల్ సిబ్బంది నిర్లక్ష్యమా.. అన్నది వారే ఆలోచించుకోవాలని చెప్పారు. హాస్టళ్లలోని కుక్‌లు ఏదో తూతూమంత్రంగా శుభ్రం చేసి ఆహారం వండివార్చుతున్నారని, చిత్తశుద్ధి లేకనే ఇలా ఆహారం కలుషితం అవుతుందని ఆరోపించారు. ఇలాంటి ఘటనల వలన ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చే అవకాశం ఉందన్నారు. క్రాంతికుమార్ మాట్లాడుతూ బీసీ శాఖలో ప్రక్షాళన జరగాల్సిన అవసరం ఉందన్నారు. వారికి మంచి ఆహారం అందించేందుకు ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. నిర్లక్ష్య ధోరణి కూడా చాలా ఎక్కువగా కనిపిస్తుందని, ఉద్యోగుల్లో ఏముందిలే అనే వైఖరి వారిలో స్పష్టంగా కనిపిస్తుందని విమర్శించారు. నిర్లక్ష్యమే ఆహారం కలుషితానికి కారణమన్నారు. వెంట బీసీ నాయకులు హనుమంత్‌యాదవ్, దారం అశోక్ కుమార్ ఉన్నారు.



గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలం అన్నపర్రు గ్రామంలోని బీసీ బాలుర హాస్టల్‌లో అస్వస్థతకు గురై గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థులు

– సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు

డ్రగ్స్ వినియోగంతో జీవితాలు నాశనం

పట్టణ సీఐ వీర నాయక్



పోస్టర్ ఆవిష్కరించిన పోలీస్ అధికారులు

పొన్నూరు: డ్రగ్స్ వినియోగం అత్యంత ప్రమాదకరమని, వాటి బారినపడితే జీవితాలు నాశనమవుతాయని, యువత జాగ్రత్తగా ఉండాలని పట్టణ సీఐ వీర నాయక్ అన్నారు. ఈగల్ సెల్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని సుజాత డిగ్రీ కళాశాలలో మాదకద్రవ్యాల (డ్రగ్స్) దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ వీర నాయక్ పాల్గొని విద్యార్థులకు డ్రగ్స్ వాడకం వలన కలిగే శారీరక, మానసిక, సామాజిక నష్టాలను వివరించారు. డ్రగ్స్ వినియోగం తాత్కాలిక ఆనందాన్ని మాత్రమే ఇస్తుందని, కానీ జీవితాన్ని నాశనం చేసే ప్రమాదకరమైన వ్యసనమని హెచ్చరించారు. యువత మానసిక ఒత్తిడులు, ఫ్యాషన్, స్నేహితుల ఒత్తిడికి లోనై డ్రగ్స్ వైపు అడుగులు వేయకూడదని సూచించారు. సోషల్ మీడియా, ఇంటర్నెట్ ద్వారా వ్యసనాలకు దారితీసే ప్రలోభాలకులోను కాకుండా, క్రీడలు, సంగీతం, పుస్తక పఠనం వంటి మంచి అలవాట్లలో ముందుండాలని విద్యార్థులను ప్రోత్సహించారు. ఎవరైనా డ్రగ్స్ వాడుతున్నా, విక్రయిస్తున్నారని తెలిసిన పక్షంలో వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. డ్రగ్స్ నిర్మూలనలో ప్రతి విద్యార్థి బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈగల్ ఎస్ఐ సునీల్ బాబు మాట్లాడుతూ చిన్నపాటి మాదకద్రవ్యాలు(పొగాకు, మద్యం, గంజాయి) వాడకం తర్వాతి దశలో తీవ్రమైన డ్రగ్స్(కొకైన్, హెరాయిన్, మెథాంఫెటమైన్) వాడకానికి మార్గం సుగమం చేస్తుందని హెచ్చరించారు. డ్రగ్స్, మాదకద్రవ్యాలపై సమాచారం ఉంటే ఈగల్ టోల్ ఫ్రీ నంబర్ 1972కి సమాచారం ఇవ్వాలని కోరారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీహరి, ఈగల్ టీం పాల్గొన్నారు.


ఎస్సీ హాస్టల్స్ తనిఖీ

పొన్నూరు: నాణ్యత కలిగిన భోజనంతో పాటు విద్యార్థులకు కాచి చల్లార్చిన నీటిని మాత్రమే అందించాలని సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ యు.చెన్నయ్య, హాస్టల్ వార్డెన్లకు సూచించారు. శుక్రవారం పట్టణం, మునిపల్లెలోని సాంఘిక సంక్షేమ బాలికల, బాలుర వసతి గృహాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. మెనూ రికార్డులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. భోజన వసతులపై ఆరా తీశారు. వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీడీ మాట్లాడుతూ అనారోగ్యానికి గురైతే ఇంటికి వెళ్లాల్సిన అవసరం లేదని మెరుగైన వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. పొన్నూరు ఎస్సీ బాలికల హాస్టల్లో ఆర్వో ప్లాంటుకు మరమ్మతులు చేయించనున్నట్లు చెప్పారు. దుప్పట్లు, దోమతెరలు ఎల్లప్పుడు అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్లు వెంకటేశ్వరమ్మ,, సుష్మ ప్రియ పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

గుంటూరు రూరల్: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి 15 మందిని శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. నల్లపాడు పోలీసులు, ఈగల్ టీమ్ తెలిపిన వివరాలు.. గోరంట్లలోని శ్రీకన్వెన్షన్ వెనుక ఓ నివాసంలో పేకాట నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. పేకాటరాయుళ్లని అరెస్ట్ చేసి, వీరి నుంచి రూ.96 వేలు, ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి పోలీసులు చెప్పారు.

జీవన ఎరువుల వినియోగంపై అవగాహన



సదస్సులో పాల్గొన్న ఏరువాక కేంద్రం అధికారులు, రైతులు, విద్యార్థులు

గుంటూరు రూరల్: వ్యవసాయంలో జీవన ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలంలోని జొన్నలగడ్డలో శుక్రవారం చేపట్టారు. ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ ఎ.మనోజ్ మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయంలో భాగంగా ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం రైతుల కోసం వివిధ జీవన ఎరువులను అభివృద్ధి చేసిందని తెలిపారు. వీటిలో ముఖ్యమైనవి రైజోబియం, ఫాస్ఫరస్ సాల్యూబులైజింగ్ బ్యాక్టీరియా, పొటాషియం రిలీజింగ్ బ్యాక్టీరియా, అజోస్పైరిల్లం, వేమ్ తదితర జీవన ఎరువులు ఉన్నాయని చెప్పారు. వీటిని రైతులు వినియోగించడం ద్వారా రసాయనిక ఎరువుల మోతాదుని 20–25 శాతం తగ్గించడమే కాకుండా భూసారం పెంచుకోవడానికి అవకాశం ఏర్పడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతులకు జీవన ఎరువులతో విత్తనశుద్ధి పద్ధతిని క్షేత్రస్థాయిలో ప్రదర్శించి చూపారు. ఇటువంటి కార్యక్రమాలు రాష్ట్ర నలుమూలల వివిధ గ్రామాలలో ఈ నెల 13 నుంచి 17వ తేదీ వరకు విశ్వవిద్యాలయ ఆధ్వర్యంలో జరుగుతాయని తెలిపారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలి

గుంటూరు మెడికల్: ఆధునిక జీవన శైలి వలన రోజురోజుకు మానసిక సమస్యలు పెరిగిపోవడం చాలా ఆందోళన కలిగిస్తోందని గుంటూరు జీజీహెచ్ మానసిక వ్యాధుల విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వడ్లాది వెంకట కిరణ్ అన్నారు. చిన్న, పెద్ద తేడా లేకుండా మానసిక సమస్యలు పెరిగిపోతున్న దృష్ట్యా ప్రతి ఒక్కరూ మానసిక ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అంతర్జాతీయ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం జీజీహెచ్ మానసిక వ్యాధుల విభాగంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రాథమిక దశలోనే మానసిక వ్యాధులను గుర్తించడం ద్వారా త్వరితగతిన నివారించవచ్చన్నారు. వ్యాధి బాధితులకు చికిత్స, కౌన్సెలింగ్‌తో పాటు కుటుంబ సభ్యుల ఆదరణ తప్పనిసరిగా ఉండాలన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో అన్ని వర్గాలకు మేలు



గుంటూరు వెస్ట్: కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీతో అన్ని వర్గాల ప్రజలకు మేలు అని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. స్థానిక ఏసీ కాలేజ్ గ్రౌండ్‌తో పాటు అసెంబ్లీ హాలులో నిర్వహించిన జీఎస్టీ ఎగ్జిబిషన్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఆయనతో పాటు జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు, పశ్చిమ, తూర్పు నియోజకవర్గ శాసన సభ్యులు గళ్లా మాధవి, మొహమ్మద్ నసీర్ అహ్మద్, నగర డెప్యూటీ మేయర్ షేక్ సజీల, జీఎస్టీ జాయింట్ కమిషనర్ గీతా మాధురి హాజరయ్యారు. అధికారులు, ప్రజాప్రతినిధులు జీఎస్టీ ఉపయోగాలను వివరించారు. ఈ సందర్భంగా అధికారులు జీఎస్టీ 2.0లో ప్రవేశపెట్టిన కొత్త నిబంధనలు, తక్కువ పన్నుల విధానాలు, వినియోగదారుల రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు.